


# నన్ను మినహాయించండి

ఇసుకపల్లి సుజాత

సాయంత్రం అయిదు గంటలయినా సూర్యుడికింకా కసి తీరలేదు. ఆకాశంలో అలా ఏకాకిలా ఉండాల్సి వచ్చినందుకు మండిపోయి ఇంకా నిప్పులు చెరుగుతున్నాడు.

కుర్చీలో ఫ్యాన్ కింద కూర్చున్నా అసహనంగా అటూ ఇటూ కదులుతున్నాడు కృష్ణమూర్తి.

డాక్టరేమో ఇంకా రాలేదు. వచ్చిన వాళ్ళందరూ నంబర్లు తీసుకుని కూర్చుంటున్నారు. కొందరు నంబర్ తీసుకుని గాలి ఆడుతుందని అలా కాస్సేపు తిరిగి రావటానికని బైటికెళ్ళారు.

కృష్ణమూర్తికి కూడా బైటికి .వెళ్ళాలనే ఉంది హాయిగా. కానీ ఒకసారి లేస్తే మాత్రం మళ్ళీ కూర్చునే చోటు దొరకదేమోనని భయం.

పిల్లలు. పెద్దలు. వృద్ధులు రక రకాల వయస్సుల వాళ్ళూ అక్కడున్నారు.

కొంతమంది పైకి కనిపించేట్టుగాను. మరి కొంతమంది లోలోపలే కుమిలిపోతూ రక రకాల బాధలతో వాళ్ళంతా అల్లాడి పోతున్నారు.

'అబ్బ! ఇంత మంది రోగులేంటో అసలు?' అని చిరాకు పడిపోయి మళ్ళీ తనలో తానే నవ్వుకున్నాడు

'మరి తను వచ్చింది ఎందుకో? అన్న విషయం గుర్తుకు వచ్చి.

కొంతమంది పిల్లలు ఎవరికి తోచినట్టు వాళ్ళు ఆడుకుంటున్నారు.

మరి కొందరు మంచి నీళ్ళు కావాలనో లేకపోతే బిస్కెట్లు కావాలని పేచీ పెడూ పెద్ద వాళ్ళను ఏడిపిస్తూ వాళ్ళు ఏడుస్తున్నారు.

ఏదైనా కావాలంటే నెమ్మదిగా అడగాలి కానీ ఊర్కనే అలా ఏడుస్తారెందుకీ పిల్లలు అని విసుక్కుంటూ కాస్త హాయిగా విశాలంగా కూర్చుందామని ప్రయత్నించాడు.

కానీ కుదరలేదు. ఇంత ఇరుగ్గా ఉందేమిటని పక్కకు తిరిగి చూసేసరికి తన పక్కనే ఒక అపరిచిత వ్యక్తి కూర్చుని ఉన్నాడు.

ఆశ్చర్యపోయాడు కృష్ణమూర్తి.

తనకు తెలియకుండా పైగా తన కుర్చీలోనే, తన పక్కనే అంత నేర్పుగా ఎలా ఇరికాడా అని నొసలు చిట్లించి అతని వైపు చూశాడు కృష్ణమూర్తి.

అతను నవ్వాడు.

అతని స్వరంలో అణకువ తొణికిస లాడుతోంది.

'నాది పదిహేను, మరి....మీ నంబరెంత' అడిగాడు కుతూహలంగా కృష్ణమూర్తి.

'నాది ఇరవైలెండి' అన్నాడు

అతని మొహం దిగాలుగా ఉంది.

ఆ నంబర్ విన్నాకగానీ కృష్ణమూర్తి మనస్సు నెమ్మదించలేదు. పై పెచ్చు అతను తనకంటే ఆలస్యంగానే ఇంటికి వెళ్తాడులే అని సంతోషించాడు కూడా.

'నేనే ఎప్పుడు బైటపడతానా అని ఎదురు చూస్తుంటే పాపం, ఇరవయ్యో నంబరంటే మరి మీరెప్పుడు బైట పడేటట్టు? అయినా నంబర్లు కదలటం మొదలయ్యిందంటే చిటికెలో వచ్చేస్తుందిలెండి మీ ఇరవయ్యో నంబర్' అని పైకి మాత్రం జాలి పడుతూ కాస్త ధైర్యం చెప్పాడు.

అతను చిన్నగా నవ్వాడు.

డాక్టర్ వచ్చినట్టున్నాడు.

జనంలో కల కలం బయలు దేరింది.

అయిదు నిమిషాలు గడిచాయి.

కాంపౌండర్ కేకేశాడు.

ఒక వ్యక్తి లేచి లోపలి కెళ్ళాడు.

మళ్ళీ వెంటనే తలుపు మూసుకుంది.

పావు గంటయ్యాక ఆ వ్యక్తి బైటి కొచ్చాడు.

రెండో నంబర్ వాళ్ళను రమ్మన్నాడు కాంపౌండర్.

'ఇంత లేట్‌గా ఈ ప్రకారం లైను కదుల్తుంటే నా ఇరవయ్యో నంబర్ ఎప్పుడు వచ్చేను. నే నెప్పుడింటి కెళ్ళేను. మీరే చెప్పండి' అన్నాడా వ్యక్తి బాధగా కృష్ణమూర్తితో

ఏమీ తోచక కృష్ణమూర్తి నవ్వేసి ఊరుకున్నాడు

ఒక క్షణ మాగాక ఆ వ్యక్తి కృష్ణమూర్తి భుజాన్ని తట్టి 'అదిగో.. అటు చూశారా? ఆ లోపలి కెళ్ళే వాళ్ళను గుర్తు పట్టారా? వాళ్ళంతా మన తరువాత వచ్చిన వాళ్ళే. అప్పుడే వాళ్ళు లోపలి కెళ్ళిపోతున్నారు చూడండి. అసలు ఒక రూల్ పెడితే అందరూ ఆ రూల్ ప్రకారమే నడవాలి కదండీ. ఇలా మధ్యలో దూరితే మాత్రం నాకు మహా ఒళ్ళు మంట. దేనికైనా న్యాయం, ధర్మం ఉండాలి. ఎప్పట్నుంచో పడిగాపులు కాస్తున్న వాళ్ళంతా ఇక్కడే ఉండిపోయారు ఆలస్యంగా వచ్చిన వాళ్ళు మాత్రం తొందరగా లోపలి కెళ్ళిపోతున్నారు. అదే మనం చేస్తే ఎక్కడలేని రూల్సూ మనకే చెప్తారు' అన్నాడావ్యక్తి ఆవేశంగా

వాళ్ళు డాక్టర్ దగ్గర అంతకు ముందే అప్పాయింట్‌మెంట్ తీస్కున్నారేమో. మనకేం తెల్సు' అని సందేహం వెలిబుచ్చాడు కృష్ణమూర్తి.

'ఆ...ఈ అప్పాయింట్‌మెంట్లన్నీ వట్టి బూటకాలే-నండీ బాబూ. అసలు ఈ విషయా లేవీ డాక్టర్‌కు తెలియవు. బైట నర్సులు కాంపౌండర్‌లు ఆడే నాటకా లివి.

వచ్చిన వాళ్ళు ఎంతో కొంత ఈ నర్సులకు ముట్ట చెప్తారు. దాంతో బైట మనతో వీళ్ళు అప్పాయింట్‌మెంట్ తీస్కున్నారని చెప్పి తమకు ముట్ట చెప్పిన వాళ్ళను ముందు లోపలికి పంపించేస్తారు. ఇలాంటి చెత్త పనులు చెయ్యలేని మనలాంటి వాళ్ళు మాత్రం, ఇదిగో ఇలా మిగిలిపోతూంటాం అంతే' అన్నాడా వ్యక్తి నిస్సహాయంగా.

ఆ మాట నిజమేననిపించింది కృష్ణమూర్తికి.

'కాలం మారిపోతోంది. నీతీ నిజాయితీలకు నిలువ నీడ లేకుండా పోతోంది. మనమేం చేస్తాం చెప్పండి' అన్నాడు కృష్ణమూర్తి కొంత ఓర్పుగా.

'కాలం మారుతోంది నిజమే. నేను కాదనట్లేదు. అలాగని అందరూ ఇలా చూస్తూ ఊర్కుంటే ఎలా? లంచాలు ఇచ్చి పుచ్చుకోవడం, అన్యాయాలు చెయ్యడం ఇంకా మితిమీరిపోవూ? చిన్న విషయాలే కదా అని వీటిని ఇలాగే వదిలేస్తే ఇవే రేపు పెద్దవై నెత్తి మీద పెత్తనం చెలాయిస్తాయి. అసలు నన్నడిగితే ఆస్పత్రుల్లో కంప్లయింట్ బాక్స్ పెట్టి దాని తాళం డాక్టర్ తన దగ్గరే ఉంచుకుని వచ్చిన కంప్లయింట్స్‌ని పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటే బైట ఈ నర్సులు మొదలైన వాళ్ళు చేసే ఆగడాలు కాస్త అయినా తగ్గుతాయి. లేకపోతే మనలాంటి వాళ్ళకు చాలా కష్టమైపోతుంది' అన్నాడా వ్యక్తి ఉద్వేగంగా

# నన్ను మినహాయించండి

'అవును మీరు చెప్పింది నిజమే. కానీ ఈ విషయం...డాక్టర్‌తో ఎవరు చెప్తారు' అని ఆలోచిస్తూ అడిగాడు కృష్ణమూర్తి.

"ఎవరో ఎందుకండీ, నేను లేనూ. ఇప్పుడే వెళ్లి చెప్పొస్తాను కావాలంటే. అంతేకానీ ఈ అన్యాయాన్ని మాత్రం నేను సహించలేను.

అరె.. ..అసలు పది నంబర్లు నడిచాయంటే ఇరవై నంబర్లు నడిచినట్లు లెక్క అవుతోంది నంబర్లు-లేని తక్కిన పది మందీ గుట్టు చప్పుడు కాకుండా నర్సుల చేతిలో డబ్బు పెట్టి తొందరగా లోపలి కెళ్ళి వచ్చి ఇంటి కెళ్ళిపోతారు. అందరూ ఏదో బాధ ఉండ బట్టేగా ఆస్పత్రికి వచ్చేది పనులన్నీ మానుకుని అనవసరంగా ఇలా పడిగాపులు కాయాల్సిందేనా?' అన్నాడా వ్యక్తి కోపంగా కుర్చీలోంచి లేస్తూ.

కృష్ణమూర్తి అతని చెయ్యి పట్టి లాగాడు.

'మీ నంబర్ రానివ్వండి. అప్పుడే ఈ విషయం చెప్పచ్చు. మధ్యలో మీ రిలా న్యాయం ధర్మం అంటూ లోపలి కెళ్ళి చెప్తే అందరూ మిమ్మల్ని వింతగా చూస్తారు బాగుండదు కూర్చోండి' అన్నాడు కృష్ణమూర్తి అర్థింపుగా.

'మనమిలా వెనకా ముందూ ఆలోచిస్తూ కూర్చుంటే ఏ వ్యవస్థా బాగుపడదు. ఆ నర్సులు డబ్బు అవసరం కొద్దీ అడుగుతారు. డబ్బిస్తే పని తొందరగా అవుతుంది కదా అని వచ్చిన వాళ్ళిస్తారు డాక్టర్‌చేత నర్సులకు బుద్ధి చెప్పిస్తే ఈ తంటా లుండవుకదా. ఉండండి ఒక్క నిమిషం ...ఇప్పుడే వెళ్ళి డాక్టర్‌తో చెప్పొస్తా నీ విషయం అదిగో ఆయన అక్కడే ఉన్నాడు' అని గబ గబా లోపలి కెళ్ళాడా వ్యక్తి.

కృష్ణమూర్తి నవ్వుకున్నాడు.

'ఇతని పిచ్చి గానీ ఇత నొక్కడూ వెళ్ళి చెప్పినంత మాత్రాన ఎప్పట్నుంచో ఈ పద్ధతికి అలవాటుపడ్డ ఈ నర్సులు మానుకుంటారా? అయినా ఈ విషయం డాక్టర్‌కి మాత్రం తెలియనిదా ముఖ స్తుతికి డాక్టర్ కూడా, అలాగా ఇకమీద అలా జరక్కుండా చూస్తానని ఒక్కమాట అనేస్తాడు ఆ మాట కోస్తే ఇది ఆయనకు కూడా సాధ్యమయ్యే పని కాదు. ఇటువంటివి రూపు మాపటం అంత తేలికను-కుంటున్నాడితను పాపం!' అని జాలి పడుతూ పరి పరి విధాలుగా ఆలోచిస్తున్నాడు కృష్ణమూర్తి

ఇంతలో అతను బాణంలా దూసుకుని బైటికి రానే వచ్చాడు.

కానీ అదేంటి?, జరిగిందేంటో చెప్పకుండా అలా బైటి కెళ్ళిపోతున్నాడేంటి? డాక్టర్‌తో ఏమైనా ఘర్షణ పడ్డాడా ఏంటి? అని రక రకాలుగా ఆలోచిస్తూ లేచి గబ గబా రెండడుగులు ముందు కేశాడు కృష్ణమూర్తి పోనీ పిలుద్దామంటే తనకు అతని పేరేమిటో కూడా తెలీదు.


ఏం చెయ్యాలో తోచక పరుగున వెళ్ళి అక్కడున్న కాంపౌండర్‌ని -

'ఇప్పుడే బైటికి వెళ్ళిపోయిన ఆ వ్యక్తికీ, డాక్టర్‌కీ మధ్య పోట్లాటగానీ, ఘర్షణగానీ ఏమైనా జరిగిందా?' అని ఆతృతగా అడిగాడు కృష్ణమూర్తి

'పరీక్ష చేయించుకుని మందు చీటీ రాయించుకుని అతను వెళ్ళిపోతుంటే, వాళ్ళు పోట్లాడుకున్నారా అని అడుగుతావేంటి' అన్నాడు కాంపౌండర్ కృష్ణమూర్తి కేసి చిరాకుగా చూసి, పదిలంగా రెండు రూపాయల నోటు మడిచి జేబులో పెట్టుకుంటూ

అది చూసి కృష్ణమూర్తి అవాక్కయ్యాడు

చేతిలో ఉన్న పదిహేనో నంబర్ చీటీ అతన్ని వెక్కిరించింది. □




## అన్వేషణ

చందమామకు చల్లదనమును
సన్నజాజికి సౌరభమ్మును
సత్యసూక్తికి శాశ్వతత్వము
ఎవ్వడిచ్చెను? ఎవ్వడిచ్చెను?
బొండు మల్లెకు పూర్ణధవళిమ
గండశిలలకు కఠిన దేహము
నిండు గుండెకు దండి చేతులు
ఎవ్వడిచ్చెను? ఎవ్వడిచ్చెను?
కంచు గంటకు క్రమనాదము
మించు చెలువకు మేని కాంతులు
మంచి మనసుకు మంచి తలపులు
ఎవ్వడిచ్చెను? ఎవ్వడిచ్చెను?

—కనమలూరు వెంకట శివయ్య